తొలి విడుతలో 56,217 మందికి రుణమాఫీ

రైతుల జాబితా విడుదల

- మొదట రూ.లక్ష వరకు వారికి మాత్రమే మాఫీ
- లక్షలోపు ఉన్న రైతులకు కూడా పలు కారణాలతో ఆపిన ప్రభుత్వం
- నేటి సాయంత్రం రైతు వేదికల్లో కార్యక్రమాలు
- ఇప్పటికే రుణాలు చెల్లించిన వారికి పడ్తాయా..? లేదా..?



సూర్యాపేట, జూలై 17 (నమస్తే తెలంగాణ) : రైతు రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధం చేసింది. తొలి విడుతలో రూ. లక్షలోపు రుణాలు తీసుకున్నోళ్లకు మాఫీ చేయనున్నది. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 56,217 మంది రైతులు ఉన్నారు. ఇందులో సూర్యాపేట నియోజకవర్గంలో 11,623 మంది, తుంగతుర్తిలో 11,209, కోదాడలో 16,864, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 16,521 మంది రైతులు ఉన్నారు. తొలి విడుతలో రూ.లక్ష లోపు ఉన్న వారికి, ఈ నెలాఖరు వరకు రూ.1.5 లక్షలు, ఆగస్టు మొదటి వారంలో రూ.రెండు లక్షల రుణ మాఫీ చేయనున్నట్లు సర్కారు ప్రకటించింది. రుణమాఫీలో ప్రభుత్వం కోతలు పెట్టింది. ఇంట్లో ఉద్యోగస్తులు ఉన్న వారిని, ఆదాయపు పన్ను కడుతున్న వారిని పక్కకు పెట్టింది. ఈ మాఫీ డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 వరకు తీసుకున్న వారికి వర్తించనుంది. రుణమాఫీపై గురువారం సాయంత్రం రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది.

రైతు వేదికల్లో కార్యక్రమాలు

అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మొత్తం మాఫీ ఒకేసారి చేస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించినా.. ఇప్పుడు మాత్రం విడుతల వారీగా చేస్తున్నది. మూడు విడుతల్లో చేస్తామని చెబుతున్నది. తొలుత రూ.లక్షలోపు రుణాలు ఉన్నోళ్లకు మాఫీ చేస్తామని ప్రకటించింది. దీంతో గురువారం సాయంత్రం రూ. లక్ష వరకు రుణాలు ఉన్న రైతులకు మాత్రమే రుణాలు మాఫీ కానున్నాయి. రుణమాఫీలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో రైతులు, ప్రజాప్రతినిధులతో కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం క్లస్టర్ వారీగా ప్రత్యేకంగా అధికారులను నియమించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సాయంత్ర నాలుగు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఎవరైనా రైతులు కూడా మాట్లాడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణమాఫీ అనంతరం సంబురాలు నిర్వహించే అవకాశం ఉంది.

రుణాలు కట్టినోళ్ల సంగతేంది..?

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి 2018 కటాఫ్‌గా నిర్ణయించింది. గత ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను 70శాతం వరకు మాఫీ చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా మిగతా వారికి మాఫీ కాలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 2018 వరకు తీసుకునోళ్లకే అని చెబుతుండటంతో వారంతా నష్టపోయే ప్రమాదం ఉంది. మరోవైపు బ్యాంకుల ఒత్తిడితో కొందరు రైతులు రుణాలు చెల్లించారు. ఇప్పటికే రుణాలు చెల్లించిన వారికి సర్కారు ఇస్తుందా..? లేదా అనేది స్పష్టత లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాత్రం ముందుగా రుణాలు చెల్లించినా.. తర్వాత ప్రభుత్వం వారికి డబ్బులు సమకూర్చింది.

ఘనంగా తొలి ఏకాదశి

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

కోదాడ : రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రత్యేకాలంకరణలో మేళ్లచెర్వులోని భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి

సూర్యాపేట రూరల్, జూలై 18 : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా బుధవారం తొలి ఏకాదశి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిధిలోని పిల్లలమర్రి లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకుడు ముడుంబై రఘువరన్ ఆచార్యులు పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు అభిషేకం చేసి, ప్రత్యేకాలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూకంటి రాజబాబు రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- బొడ్రాయిబజార్ : సూర్యాపేట పట్టణంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు సాయిబాబ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల ప్రధానార్చకులు వలివేటి వీరభద్రశర్మ, రెంటాల సతీశ్‌శర్మ, విశ్వేశ్వరశర్మ, గంగాధర శర్మ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.
- మేళ్లచెర్వు : శంభు లింగేశ్వరస్వామి, భూనీలా సమేత వేంకటేశ్వరాలయంలో ఏకనామ భజనలు చేశారు. అర్చకులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ, రంగభట్టరాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.
- నేరేడుచర్ల : మండలంలోని కొదండ రామాలయంలో వేద పండితుడు నరసింహాచార్యులు, అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో ఆలయ పూజారి ఉగ్రదండి శివప్రసాద్ శర్మ, విజయదుర్గ ఆలయంలో మొలుగు శ్రీనివాసాచార్యులు, సోమప్ప ఆలయంలో పూజారి సురేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
- మఠంపల్లి : మండల కేంద్రంలోని రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో రెడ్డి పరివార్ మహిళా సంఘ సభ్యులు గోరింటాకు సంబురాలు నిర్వహించారు.
- కోదాడ : పట్టణంలోని రామాలయంలో ప్రజలు విష్ణుమూర్తిని దర్శించుకున్నారు. కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించింది.
- తుంగతుర్తి : మండల కేంద్రంలో అర్చకులు కాటూరి రామాచార్యులు, పొలవరపు సరస్వతి, తల్లాడ సూర్యకళ, తల్లాడ పద్మ, బండారు విజయ, తోట సులోచన, ఈగ కవిత, విజయ, మహిళా భక్తులు పాల్గొన్నారు.
- నూతనకల్ : మండలంలోని ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు.
- అర్వపల్లి : యోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో అర్చకులు రాంబాబు అయ్యంగార్ పూజలు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

సూర్యాపేటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

- పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, జూలై 17 : సూర్యాపేట పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంజనీర్ల బృందంతో ఇప్పటికే సూర్యాపేట అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించామని, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.61 కోట్లు ఎస్టిమేషన్ రూపొందించినట్లు తెలిపారు. సిద్దిపేట తరహాలో మినీ ట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేయడంతో పాటు పట్టణంలో నాలుగు సెల్ఫీపాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా పిల్లలమర్రి శివాలయాలు, ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నాగులపహాడ్ దేవాలయం, మూసీ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫీఉల్లా, వల్దాస్ దేవేందర్, గోపాల్‌రెడ్డి, పులగం వెంకట్‌రెడ్డి, పిల్లల రమేశ్‌నాయుడు, బైరబోయిన శ్రీనివాస్, నేరెళ్ల మధు, లింగానాయక్, జానయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ

వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బొడ్రాయిబజార్, జూలై 17 : స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ దవాఖానలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివేకానంద వృద్ధాశ్రమ నిర్వాహకుడు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సవరల సత్యనారాయణ అన్నారు. పట్టణ పరిధిలోని వివేకానంద వృద్ధాశ్రమంలో హైదరాబాద్‌కు చెందిన కంచి కామకోటి శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి సంబంధిత వ్యాధులకు ఉచిత పరీక్షలు చేసి ఆపరేషన్ కూడా ఫ్రీగా నిర్వహించి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్గనైజర్ బాలరాజు మాట్లాడుతూ ఆసుపత్రి ఆధ్వర్యంలో 30లక్షల ఆపరేషన్లు, 5కోట్ల మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమున్న వారిని హైదరాబాద్ తీసుకెళ్లి ఉచితంగా నిర్వహించి నెల తరువాత వచ్చి మళ్లీ పరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రిషయ్, వేదిక, పార్వతి, గోల్డెన్, సందీప్, వృద్ధాశ్రమ ట్రస్టు సభ్యులు తల్లాడ కృష్ణమూర్తి, బండి శ్రీనివాస్, కొత్త మల్లికార్జున్, కోటగిరి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి : ఒంటెద్దు

నేరేడుచర్ల, జూలై 17 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమ నేత కేసీఆర్ వెన్నంటే ఉండి కీలక పాత్ర పోషించడంతో పాటు అనేక కేసుల్లో జగదీశ్‌రెడ్డి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ బలోపేతానికి నిరంతరం శ్రమించిన నేత జగదీశ్‌రెడ్డి అని కొనియాడారు. దవాఖానల్లో పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అయ్యప్ప విగ్రహాల ఊరేగింపు

అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలు

నేరేడుచర్ల, జూలై 17 : పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాల ఊరేగింపును ఈ నెల 18న ఉదయం 8:30కి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. సుమారు రూ.కోటితో నిర్మించిన అయ్యప్ప ఆలయంలో ప్రతిష్ఠించే ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహంతో పాటు గణపతి, సుబ్రహ్మణ్యం, మాలికాపురతమ్మ అమ్మవార్ల విగ్రహాలను ఆలయ ప్రాంగణం నుంచి పుర వీధుల్లో ఊరేగింపు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రాంబాబు

చిలుకూరు, జూలై 17 : మండలంలోని బేతవోలు గ్రామ శివారులోని పోలేనిగూడెం రోడ్డులో బుధవారం మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకుళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామ శివారులో గల రైస్ మిల్లు వద్ద అదే గ్రామానికి చెందిన కడారి చంద్రమ్మ భర్త ముత్తయ్య, కుమార్తె ఉమతో కలిసి పొలంలో పని చేస్తున్నది. రోడ్డు పక్కన పని చేస్తున్న చంద్రమ్మ వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులతో బైక్‌పై వచ్చి ఫలానా రైతు పొలం ఎక్కడా అని అడిగారు. వివరాలు చెప్తున్న క్రమంలో చంద్రమ్మ మెడలో నుంచి తులం విలువైన బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చినా అప్పటికే దుండగులు పోలేనిగూడెం రోడ్డుకు పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రాంబాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

దివ్యాంగుల కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలి : రాజేశ్

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

చివ్వెంల, జూలై 17 : ఈనెల 21 నుంచి 23 వరకు వరంగల్‌లో జరుగనున్న భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గుంపులలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ పెంచుతామని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పి నేటికీ నెరవేర్చక పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గోగుల శేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మున్నా మధు, వీరమ్మ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు ఉచిత శిక్షణ హర్షణీయం : లక్ష్మీనర్సయ్య

బొడ్రాయిబజార్, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలను గుర్తించి ఉచిత శిక్షణ ఇస్తామని ప్రకటించడం హర్షణీయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చిత్రపటాలకు బుధవారం వారు పాలాభిషేకం చేసి మాట్లాడా.

నాగారం : ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తీసుకున్న నిర్ణయం పట్ల సూర్యాపేట జిల్లా ఆర్ఎంపీల సంఘం నాయకుడు నోముల శంకర్‌యాదవ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఆర్ఎంపీ డాక్టర్లు ప్రశాంత్, పాపారావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, యాదగిరి ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తుంగతుర్తి, జూలై 17 : మండల పరిధిలోని సంగెం గ్రామంలో విద్యుదాఘాతంతో బుధవారం మహిళ మృతి చెందింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం గ్రామానికి చెందిన ఏషమల్ల జయమ్మ(54) తన ఇంట్లోని నీటి సంపు వద్ద పని చేస్తుండగా అక్కడే ఉన్న విద్యుత్ మోటార్ వైర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

'ఉపాధి' డబ్బులు చెల్లించాలి : ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, జూలై 17 : మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అధికారులను కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా కూలీలకు డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ సంఘం నాయకులు సైదులు, మహేశ్, ఉప్పులయ్య, వెంకన్న ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చివ్వెంల, జులై 17 : మండలంలోని వాల్యాతండాలో బుధవారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం చందూనాయక్ తండాకు చెందిన దేవసోతు లింగ, చివ్వెంల మండలంలోని వాల్యాతండాకు చెందిన అతడి బంధువు బానోతు హరిప్రసాద్‌తో కలిసి పరిసర ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ బి వెంకట్‌రెడ్డి దాడులు జరిపి సీజ్ చేశారు. డీసీఎం డ్రైవర్ ధరావత్ కృష్ణయ్యతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొనారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ జడ్పీటీసీ వీరప్రసాద్ యాదవ్

అర్వపల్లి, జూలై 17 : రూ.2 లక్షల రుణమాఫీకి కొర్రీలు పెడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని జాజిరెడ్డిగూడెం మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. అర్వపల్లి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. రుణం తీసుకున్న రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ ఇప్పుడు రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెట్టడంతో కార్డులు లేని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షరతులు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగానే రుణమాఫీ చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో పర్సాయపల్లి స్టేజీకి చెందిన బైరబోయిన సైదులు మృతి చెందడంతో మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కడారి నరేశ్, నాయకులు బైరబోయిన పెద్దయ్య, అరిగె నాగరాజు, బైరబోయిన వెంకన్న, దావుల లింగయ్య, కొమారి నాగరాజు, అంకిరెడ్డి వెంకన్న, కేలోతు రవీందర్ నాయక్, దావుల నాగరాజు, ప్రసాద్, ఆకారపు శ్రీను, అంకిరెడ్డి సందీప్, బింగి సాయి తదితరులు పాల్గొన్నారు.

పేటలో రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీలు

రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

బొడ్రాయిబజార్, జూలై 17 : తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో విజయ భాను కళా సమితి ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణ ఫ్యాన్సీ మార్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను వ్యాపార వేత్త బొమ్మిడి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో రెండ్రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పుల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మ, సీతారామశాస్త్రి, జి.సాయిలు వ్యవహరించారు. పలువురు కళాకారులు వివిధ పాత్రల్లో నిర్వహించిన ఏకపాత్రాభినయాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. నేడు విజేతలను ఎంపిక చేసి బహుమతి ప్రదానం చేయడంతో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయభాను కళా సమితి అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్యగౌడ్, తెలంగాణ నాటక సమాజాల సమైక్య ఉపాధ్యక్షులు పులి కృష్ణమూర్తి, పుల్లాభట్ల కృష్ణమూర్తి శర్మ, ప్రధాన కార్యదర్శి పేరాల సుధీర్, ప్రచార కార్యదర్శి ధనియాకుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కల్లూరు నాగయ్య, ధనియాకుల సత్యనారాయణ, చల్లా సత్యనారాయణరెడ్డి, కోశాధికారి నందిగామ భార్గవ్ కృష్ణ, కార్యవర్గ సభ్యులు దాసరి సత్యం, నందిగామ అరవింద్‌శర్మ ఉన్నారు.

పిల్లల వికాసానికి అంగన్‌వాడీలు దోహదం

- మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

నేరేడుచర్ల, జూలై 17 : పిల్లల వికాసం పెంపొందించడానికి అంగన్‌వాడీలు దోహదపడుతాయని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్ పుష్పమ్మ, బుచ్చమ్మ, పాపారావు, నాగుల్ మీరా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం

చిలుకూరులో పీర్ల ఊరేగింపు

చిలుకూరు, జూలై 17 : మండలంలోని గ్రామాల్లో బుధవారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా పీర్లను ఊరేగిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గ్రామ గ్రామాన పీర్ల ఊరేగింపు

నాగారం : మండల కేంద్రంతో పాటు పస్తాల, శాంతినగర్, పసునూరు, ఈటూరు, ఫణిగిరి గ్రామాల్లో బుధవారం మొహర్రం పండుగ సందర్భంగా పీర్లను ఊరేగించారు. తెల్లవారుజామున అగ్ని గుండాలపై నడిచారు. కార్యక్రమంలో ముజావర్లు, నిర్వాహకులు వీరగాని రమేశ్, కొలిపాక సాయికుమార్, అనంతుల సతీశ్, యాకూబ్, శ్రీనివాస్, వెంకన్న ఉన్నారు.

నేడు వర్ధమానుకోటకు ఎమ్మెల్యే రాక

నాగారం, జూలై 17 : మండలంలోని వర్ధమానుకోట రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి గణేశ్ అధ్యక్షతన నిర్వహించే రుణమాఫీ వారోత్సవాల ప్రారంభానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తొడుసు లింగయ్య తెలిపారు. రైతులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన తీరిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్లు ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | తొలిపుట : 9182777638

'ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

పాలకవీడు, జూలై 17 : ప్రభుత్వం రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 29న కలెక్టర్ కార్యాలయాలను ముట్టడి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

వ్యకిపై కేసు

హుజూర్‌నగర్ , జూలై 17 : మఠంపల్లి మండలం కొత్త తండాకు చెందిన బాణోత్ రవీందర్ తన ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా బుధవారం పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. రవీందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి పేర్కొనారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి : బీఆర్ఎస్

నూతనకల్, జూలై 17 : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మ